క్లుప్తంగా

ధనుర్మాస అమవాస్య పూజలు



గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: ధనుర్మాసం అమావాస్యను పురస్కరించుకుని మండలంలోని ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. బైటిపేటలో వెలసిన గాడు బావి వీరాంజనేయస్వామి, గౌరిపేట, పలక చింతమాను, కనుమ, సిమెంట్‌నగర్ గ్రామాల్లోని ఆలయాల్లో స్వామివారికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయం, సిమెంట్‌నగర్‌లోని సుంకులాపరమేశ్వరి ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి.

వ్యాస రచన పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



కలెక్టర్ నుంచి జ్ఞాపిక అందుకుంటున్న నాగలక్ష్మి

బనగానపల్లె రూరల్: మండలంలోని టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థిని నాగలక్ష్మీ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా నంద్యాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో మొదటి స్థానం దక్కించుకున్నట్లు స్కూల్ హెచ్‌ఎం పర్వీన్ భాను తెలిపారు. కలెక్టర్ రాజకుమారిగణియా, జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ చేతుల మీదుగా జ్ఞాపిక, రూ.3 వేల నగదు ప్రోత్సాహం అందుకున్నట్లు వెల్లడించారు.

సర్వేయర్ మృతికి సంతాపం



నివాళులర్పిస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని దుర్గాపేట కాలనీకి చెందిన గూటుపల్లె గ్రామ సర్వేయర్ మధు కేశాలు(47) రోడ్డు ప్రమాదంలో గాయపడి ఈ నెల 29న మృతిచెందారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ బుగ్గన నాగభూషణంరెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి నివాళులర్పించారు. సర్వేయర్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల సర్వేయర్ల అసోసియేషన్ తరఫున రూ.90 వేల ఆర్థిక సహాయం అందజేశారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం సభ్యులు

కోవెలకుంట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో సోమవారం ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం నూతన సంవత్సర క్యాలెండర్లను ఆవిష్కరించారు. క్యాలెండర్‌తో పాటు పాకెట్, స్టిక్కర్స్ క్యాలెండర్లను పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సరోజ విడుదల చేశారు. ఆమె మాట్లాడుతూ.. క్యాలెండర్లపై భారత దేశాన్ని పాలించిన చక్రవర్తుల చిత్రాలను ముద్రించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీపతి, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు ఇంద్రారెడ్డి, భాస్కర్‌రెడ్డి, రవీంద్రారెడ్డి, సునంద, శ్రీదేవి, ప్రవీణ్, ప్రసాద్, సుధాకర్‌రెడ్డి, సునీల్ పాల్గొన్నారు.

శ్మశాన వాటిక దారి పరిశీలన

బనగానపల్లె రూరల్: భానుముక్కలలోని రాంభూపాల్ నగర్ నుంచి శ్మశాన వాటికకు వెళ్లే దారిని ఇన్‌చార్జ్ ఈఓఆర్డీ, పంచాయతీ ఈఓ సతీష్‌కుమార్ సోమవారం పరిశీలించారు. దారి ఆక్రమణకు గురికావడంతో పాటు ముళ్ల పొదలు పెరిగిపోవడంపై కాలనీవాసులు ఫిర్యాదు చేశారు. అక్రమణలు, ముళ్లపొదలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటామని ఈఓ తెలిపారు.

అనుమతులు లేకుండా నిర్మిస్తే కూల్చివేస్తాం

డోన్: మున్సిపల్ పరిధిలో టౌన్‌ప్లానింగ్ అధికారుల అనుమతి లేకుండా భవన నిర్మాణాలు చేపడితే కూల్చివేస్తామని కమిషనర్ ప్రసాద్‌గౌడ్ హెచ్చరించారు. సోమవారం స్థానిక రైతుమిత్ర కాలనీలో అనుమతి లేని ఇంటి నిర్మాణ పనులను మున్సిపల్ సిబ్బంది అడ్డుకున్నారు.

పకడ్బందీగా ఎన్‌సీడీసీడీ సర్వే

బనగానపల్లె రూరల్: ఎన్‌సీడీసీడీ (సంక్రమిత, అసంక్రమిత వ్యాధులు) సర్వేను ఆరోగ్య సిబ్బంది పకడ్బందీగా చేపట్టాలని జిల్లా ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం ఆఫీసర్ కాంతారావు నాయక్ అన్నారు. సోమవారం టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఎన్‌సీడీసీడీ-3.0, ఆర్‌బీఎస్‌కే సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ వైద్య పరీక్షలు, 30 ఏళ్లు నిండిన మహిళలకు క్యాన్సర్ పరీక్షలు చేయాలని ఆదేశించారు.

‘పచ్చ’పాత కమిషనర్..!

- పట్టణాభివృద్ధి గాలికి
- టీడీపీ ఏజెంట్‌లా వ్యవహారం
- విచారణాధికారికి ఆధారాలతో ఫిర్యాదు చేసిన కౌన్సిలర్లు





కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌పై వచ్చిన ఫిర్యాదుల గురించి విచారణ చేస్తున్న రాయచోటి మున్సిపల్ కమిషనర్ వాసుబాబు, కమిషనర్ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కౌన్సిలర్లు

డోన్: బాధ్యతలు తీసుకుని నాలుగు నెలలైనా ప్రజా సమస్యలపై శ్రద్ధ చూపకుండా అధికార పార్టీ నాయకులకు తొత్తుగా కమిషనర్ వ్యవహరిస్తున్నారని మున్సిపల్ కౌన్సిలర్లు విచారణ అధికారిగా డోన్‌కు వచ్చిన రాయచోటి కమిషనర్ వాసుబాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ వ్యవహరించిన తీరుపై ఆధారాలను ఆయనకు సమర్పించారు.

ఈ కమిషనర్ మాకొద్దు

ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేస్తూ ప్రజాప్రతినిధులను లెక్కచేయకుండా అధికార కార్యక్రమాలకు టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్నారని వైఎస్సార్‌సీపీకి చెందిన మున్సిపల్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు అసహనం వ్యక్తం చేశారు. కౌన్సిలర్ల ప్రమేయం లేకుండా వార్డుల్లో టీడీపీ నాయకుల పెత్తనానికి అండగా నిలుస్తూ ప్రజాప్రతినిధులను అవమానిస్తున్నారని మండిపడ్డారు.

వివాదాస్పద నిర్ణయాలు

మున్సిపల్ కమిషనర్‌గా నాలుగు నెలల క్రితం బాధ్యతలు తీసుకున్న ప్రసాద్‌గౌడ్ వివాదాస్పద నిర్ణయాలతో పట్టణాభివృద్ధి కుంటుపడేందుకు కారణమవుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అధికార పార్టీ నాయకుల అండతో బదిలీపై ఆయన ఇక్కడికి వచ్చారు. గతంలో గూడూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినప్పుడు టీడీపీకి ఓట్లేసి గెలిపించాలని మెప్మా సభ్యుల సమావేశంలో కోరిన విషయం బయటకు పొక్కడంతో విధుల నుంచి సస్పెండ్ అయినట్లు తెలిసింది. ఆ తర్వాత తిరిగి డోన్ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుని ప్రజాప్రతినిధులను లెక్కచేయకుండా ఒంటెద్దు పోకడలను అవలంభిస్తూ నిస్సిగ్గుగా వ్యవహరిస్తున్నారని పాలకపక్ష సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కౌన్సిలర్ల మధ్య చిచ్చుకు కుట్ర



మున్సిపాలిటీలో 32 వార్డులు ఉండగా, ఒక సీపీఐ, రెండు టీడీపీ మినహా మిగిలిన సభ్యులందరూ వైఎస్సార్‌సీపీకి చెందిన వారే. వీరి మధ్య విభేదాలను సృష్టించడం ద్వారా పరోక్షంగా టీడీపీకి లబ్ధి చేకూరేలా కమిషనర్ వ్యవహారం ఉంది. ఇలాంటి వారికి కమిషనర్‌గా ఉండేందుకు అర్హత లేదు.

–జాకీర్ హుసేన్, మున్సిపల్ వైస్‌చైర్మన్, డోన్

పక్కా టీడీపీ కార్యకర్తలా వ్యవహరిస్తున్నారు



రాజకీయాలకు అతీతంగా పట్టణ ప్రజలకు మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత మరిచి కమిషనర్ వ్యవహరిస్తున్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన స్థానిక ప్రజాప్రతినిధులను ప్రజల ముందే అవమానిస్తున్నారు. ఇలాంటి వ్యక్తిని ఏనాడు చూడలేదు. పక్కా టీడీపీ కార్యకర్తలా వ్యవహిస్తున్న కమిషనర్‌ను వెంటనే బదిలీ చేయాలి.

–బోయ సుమలత, కౌన్సిలర్, ప్రభాకర్‌రెడ్డి నగర్

నోటీసు ఇవ్వకుండానే అనర్హత వేయాలని చూశారు



రెండుసార్లు అనారోగ్య కారణాల వల్ల సభకు హాజరు కాలేకపోయాను. నోటీసు ఇచ్చి సంజాయిషీ అడగకుండానే చైర్మన్, సభ్యుల ప్రమేయం లేకుండా అజెండాలో చేర్చి తనను కౌన్సిలర్‌గా అనర్హుడిగా చేసేందుకు కమిషనర్ ప్రయత్నించారు. అప్పటికప్పుడు అజెండాలో సభ్యుల ఆమోదం లేని అంశాలను చేర్చి మున్సిపల్ సమావేశాన్ని గందరగోళం చేయడానికి ప్రయత్నిస్తున్నారు. –దినేష్‌గౌడ్, మున్సిపల్ కౌన్సిలర్, కొండపేట

మాజీ మంత్రినే అడ్డుకున్నారు



రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రూ.10 కోట్లతో మున్సిపల్ కార్యాలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన మాజీ మంత్రి బుగ్గనను మున్సిపల్ పార్కులోని ట్రాక్‌లో వాకింగ్ చేయకుండా కమిషనర్ అడ్డుకోవడం దారుణం. అభివృద్ధి ప్రధాత అయిన మాజీ మంత్రినే ప్రధాన గేటుకు తాళం వేసి అడ్డుకోవడం దుర్మార్గమైన చర్యగా భావిస్తున్నాం. –వెంకటేశ్వరమ్మ, మున్సిపల్ కౌన్సిలర్, 3వ వార్డు

రేపు అందుబాటులో మాజీ మంత్రి బుగ్గన



మాట్లాడుతున్న మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, పార్టీ నాయకులు

డోన్/బేతంచెర్ల: మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి జనవరి 1వ తేదీ నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారని మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వలంటీర్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్ తెలిపారు. మాజీ మంత్రి ఇంట్లో సోమవారం వారు మాట్లాడారు. డోన్‌లోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో బుధవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు బుగ్గన అందుబాటులో ఉంటారన్నారు. అలాగే మధ్యాహ్నం 2 గంటల నుంచి బేతంచెర్లలో పార్టీ నాయకులు, ప్రజలకు అందుబాటులో ఉంటారని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలంరెడ్డి తెలిపారు.

నేడు ఆలయ వార్షికోత్సవం

కోవెలకుంట్ల: పట్టణ శివారులోని కుందూనది ఒడ్డున వెలసిన కంబగిరి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆలయంలో అర్చనలు, అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు. పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి జీవిత చరిత్రపై నాటక ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

పంటలు దెబ్బతింటున్నాయ్



రామ్‌కో ఫ్యాక్టరీకి వెళ్లే దారిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

కొలిమిగుండ్ల: సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే భారీ వాహనాల వల్ల దుమ్ము,ధూళితో పంటలు దెబ్బతింటున్నాయని రైతులు వాపోయారు. సోమవారం కల్వటాల, నందిపాడు, కొలిమిగుండ్ల, కోటపాడు గ్రామాలకు చెందిన రైతులు రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు పెద్దయ్య, పుల్లయ్య, శ్రీకాంత్‌రెడ్డి, నారపురెడ్డి మాట్లాడుతూ.. దుమ్ము వల్ల చీని దిగుబడి పూర్తిగా పడిపోతుందన్నారు. పలుమార్లు యాజమాన్యం దృష్టికి సమస్యను తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. పరిశ్రమకు రైతులు వ్యతిరేకం కాదని.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు వస్తాయనే ఆశతోనే భూములు ఇచ్చామని గుర్తు చేశారు. స్థానికులను కాదని ఇతర ప్రాంతాలకు చెందిన వారికి ఉపాధి కల్పించడం సరికాదన్నారు. యాజమాన్యం పరిష్కార మార్గం చూపకపోతే పంటలు పండించుకునే పరిస్థితులు ఉండవన్నారు. గంటకు పైగానే రైతులు రోడ్డుపై బైఠాయించడంతో ఫ్యాక్టరీలోకి వెళ్లే వాహనాలు ఆగిపోయాయి. కంపెనీ ప్రతినిధులు రైతులతో చర్చలు జరిపారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోడ్లపై అల్లర్లు చేస్తే ఉపేక్షించేది లేదు

- న్యూ ఇయర్ వేడుకలపై ఆంక్షలు
- డీఎస్పీ శ్రీనివాసులు



మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసులు, సీఐలు

డోన్ టౌన్: న్యూ ఇయర్ వేడుకల పేరుతో యువత రోడ్లపై బైక్ రైడింగ్‌లు, రోడ్లపై కేక్ కటింగ్‌లు చేస్తూ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డోన్ డీఎస్పీ శ్రీనివాసులు హెచ్చరించారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. రాత్రి పూట బైక్ రైడింగ్‌లు, శబ్దాలు చేస్తూ రోడ్లపై సంచరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. తల్లిదండ్రులు పిల్లలపై నిఘా ఉంచాలన్నారు. పిల్లలు తప్పు చేస్తే తల్లిదండ్రులను కూడా బాధ్యులను చేస్తామన్నారు. ఈ నెల 31వ తేదీ రాత్రి 10 గంటల తర్వాత ఎవరూ రోడ్లపై తిరగకూడదని స్పష్టం చేశారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుందని తెలిపారు.

న్యూ ఇయర్ వేడుకలపై నిఘా

న్యూ ఇయర్ వేడుకలపై పోలీసుల నిఘా ఉంటుందని, వాహనాల తనిఖీ, డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్, త్రిబుల్ రైడింగ్, ఓవర్ స్పీడ్ ఉంటే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. వచ్చే నెల నుంచి హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని డీఎస్పీ స్పష్టం చేశారు. అనంతరం హెల్మెట్‌లు ధరించి పోలీసులతో కలిసి పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. డోన్, ప్యాపిలి, బేతంచెర్ల సీఐలు ఇంతియాజ్‌బాషా, రాకేష్, వెంకట్రామిరెడ్డి, వెంకటేశ్వరరావు, ఎస్‌ఐలు శరత్‌కుమార్ రెడ్డి, నరేంద్రకుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి ఉత్పత్తులు ఆరోగ్యకరం



తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన స్టాల్

బేతంచెర్ల: ప్రకృతి వ్యవసాయంతో పండించిన కూరగాయలు, పండ్లు ఆరోగ్యానికి మంచిదని ఏఓ కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం బేతంచెర్ల తహసీల్దార్ కార్యాలయంలో ప్రజల భాగస్వామ్యంతో ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పండించిన ఆకు కూరలు, కూరగాయలు, చిరుధాన్యాల స్టాల్‌ను ఏర్పాటు చేశారు. రైతులకు పెట్టుబడి ఖర్చులు తగ్గించడమే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లో భూములు సారం కోల్పోకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రకృతి వ్యవసాయాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని మాస్టర్ ట్రైనర్ రమాదేవి తెలిపారు. సిబ్బంది మహేష్ బాబు, సుబ్రమణ్యం, మౌనిక, సురేంద్రమ్మ, కవిత పాల్గొన్నారు.

ఘనంగా పల్లకీ సేవ



పల్లకీపై విహరిస్తున్న స్వామివారు

బనగానపల్లె రూరల్: మండలంలోని యాగంటి క్షేత్రంలో వెలసిన ఉమామహేశ్వరస్వామికి సోమవారం పల్లకీ సేవను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామిఅమ్మవార్లకు అభిషేకాలు, అర్చనలు, నైవేద్య సమర్పణ చేసి కర్పూర నీరాజనాలు పలికారు. సాయంత్రం శివపార్వతుల ఉత్సవ విగ్రహాలను పల్లకీలో కొలువుంచి ఆలయ ప్రాకారంలో ఊరేగించారు. ఈఓ చంద్రుడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

చిన్నారులందరికీ టీకాలు వేయించాలి

ప్యాపిలి: టీకాలు వేయించుకోని చిన్నారులను గుర్తించి అందరికీ టీకాలు వేయాలని జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సుదర్శన్ బాబు ఆదేశించారు. స్థానిక పీహెచ్‌సీని సోమవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీలో టీకాలు నిల్వ ఉన్న గది, లేబర్ రూంను తనిఖీ చేశారు. ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో గర్భిణులు, చిన్న పిల్లల వివరాలు నమోదు చేయాలన్నారు. వివిధ దశల్లో టీకాలు తీసుకోకుండా మిగిలిపోయిన పిల్లలను గుర్తించి వెంటనే వారికి టీకాలు వేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఆయన వెంట వైద్యాధికారిణి వాణిశ్రీ, వైద్య సిబ్బంది జగదీశ్వరప్ప, విజయకుమారి, రాఘవేంద్రగౌడ్, మనోహర్ రెడ్డి, శ్రీనివాస్, రోజా, ప్రసన్న తదితరులు ఉన్నారు.

సంజామలలో వీధి లైట్లు ఏర్పాటు

సంజామల: మండల కేంద్రంలో సోమవారం వీధి లైట్లు ఏర్పాటు చేశారు. లైట్లు వేయరు.. చీకటి తొలగదు అనే శీర్షికతో ఈ నెల 29న సాక్షిలో వార్త ప్రచురితమైంది. స్పందించిన ఈఓఆర్డీ రాధికారెడ్డి గ్రామంలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పంచాయితీ కార్యదర్శి లక్ష్మయ్యను ఆదేశించడంతో లైట్లు వేయించారు.

బలపాలపల్లెలో చోరీపై ఫిర్యాదు

బేతంచెర్ల: మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామంలో ఉన్న తన ఇంట్లో ఈనెల 29వ తేదీ చోరీ జరిగినట్లు బాధితుడు భాస్కర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు.. గ్రామానికి చెందిన పైయింటి భాస్కర్, విజయలక్ష్మి దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలోని చర్చిలో జరుగుతున్న ప్రార్థనకు ఈనెల 29వ తేదీ మధ్యాహ్నం వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగలగొట్టి ఉంది. లోనికి వెళ్లి పరిశీలించగా బీరువాలో ఉన్న 6.4 గ్రాముల బంగారం, రూ.1.50 లక్షల నగదు, 220 గ్రాముల వెండి వస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేష్ బాబు సోమవారం తెలిపారు.

ఈకేవైసీ తప్పనిసరి

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల, భీమునిపాడు, లింగాల, పెద్దకొప్పెర్ల ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లోని సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని ఆయా సంఘాల పర్సన్ ఇన్‌చార్జ్‌లు రాజశేఖర్‌రెడ్డి, రామసుబ్బయ్య, లక్ష్మీనారాయణ తెలిపారు. సహకార సంఘాలను కంప్యూటరీకరణ చేసిన నేపథ్యంలో రైతులకు పంట రుణాలు, ఇతర సబ్సిడీ పథకాలు వర్తింపునకు రైతులు ఆధార్ ఈకేవైసీ అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఆయా సహకార సంఘాల పరిధిలో ఉన్న గ్రామ సచివాలయాలకు వెళ్లి రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని పేర్కొన్నారు.

పేకాట రాయళ్ల అరెస్ట్

డోన్ రూరల్: మండల పరిధిలోని గోసానిపల్లి సమీపంలో సోమవారం పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు రూరల్ పోలీసులు తెలిపారు. గ్రామంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు చేసినట్లు చెప్పారు. వారి వద్ద నుంచి రూ.6,800, మూడు బైక్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

సీపీఐ సభను జయప్రదం చేద్దాం

డోన్ రూరల్: సీపీఐ శత వార్షికోత్సవ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎన్.రంగనాయుడు కోరారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ప్రజాసంఘాల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బహిరంగ సభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హాజరుకానున్నట్లు తెలిపారు.

టీడీపీలో ఫ్లెక్సీల వార్



టీడీపీ ప్రధాన కార్యాలయం వద్ద బ్లేడ్‌తో కోసివేసిన ఫ్లెక్సీ



కోట్ల వర్గీయులు చింపివేసిన ధర్మారం సుబ్బారెడ్డి ఫొటో

డోన్: డోన్ నియోజకవర్గంలో టీడీపీ నాయకుల మధ్య ఫ్లెక్సీ వార్ కొనసాగుతోంది. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ మొదటగా పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మారం సుబ్బారెడ్డి పేరును ప్రకటించడం ఆ తర్వాత ఆయన స్థానంలో మాజీ మంత్రి కోట్ల జయ సూర్య ప్రకాష్‌రెడ్డి అభ్యర్థిత్వాన్ని ఖరారు చేసింది. దీంతో టీడీపీ కూటమి నాయకులతో కలిసి వేసిన ఫ్లెక్సీల్లో సుబ్బారెడ్డి చిత్రాన్ని కోట్ల వర్గీయులు రాత్రికి రాత్రే చింపివేశారు. అప్పట్లో సుబ్బారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేయగా కోట్ల వర్గీయులైన ముగ్గురిపై కేసు నమోదైంది. ఇది ఇలా ఉండగా కేఈ, కోట్ల వర్గానికి చెందిన వారు తారమకనగర్‌లోని టీడీపీ ప్రధాన కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఆదివారం వివాదానికి దారి తీసింది. ఈ ఫ్లెక్సీలో కోట్ల వర్గీయుల ఫొటోలు పైన వేసుకుని తమ ఫొటోలు కింద వేసి అవమానించారని బంటుపల్లె రామాంజనేయులు కోట్ల వర్గీయులతో ఆదివారం వాగ్వాదానికి దిగినట్లు తెలిసింది. అదే రాత్రి ఫ్లెక్సీపై ఉన్న కోట్ల ఫొటోను బ్లేడ్‌తో కోసివేయడంతో వివాదం ముదిరింది.

పాత విధానంలోనే రాయల్టీ మంజూరు చేయాలి



ఒంటికాలిపై నిరసన తెలుపుతున్న పరిశ్రమ యజమానులు, కార్మికులు

బేతంచెర్ల: నాపరాతి పరిశ్రమలకు పాత పద్ధతిలోనే ప్రభుత్వం రాయల్టీని మంజూరు చేయాలని గనులు, పరిశ్రమల యజమానులు, కార్మికులు ఒంటి కాలిపై నిలిచి నిరసన తెలిపారు. పట్టణంలోని బనగానపల్లె రైల్వే గేటు సమీపంలో నాపరాతి పరిశ్రమలపై కన్సిడరేషన్ పన్నులను ఎత్తి వేయాలని కోరుతూ చేపట్టిన రిలే నిరహార దీక్షలు సోమవారం 4వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..నాపరాతి పరిశ్రమపై ప్రభుత్వం ఫీజుల భారం మోపడం దారుణమన్నారు. ఎంతో మందికి ఉపాధి చూపుతున్న పరిశ్రమను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పెంచిన రాయల్టీ పర్మిట్ చార్జీలను ఉపసంహరించుకుని చిన్న తరహా పరిశ్రమలను కాపాడాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఉదయ్ డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్, సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు రిలే నిరాహార దీక్షలకు సంఘీభావం తెలిపారు. పరిశ్రమల యజమానులు నాగేశ్వర్‌రెడ్డి, చింతల నాగిరెడ్డి, మోహన్‌రావు, నాగేంద్ర, వలీ, మురళీ, అరుణ్ కుమార్, ధనుంజయ, రాంబాబు పాల్గొన్నారు.

సబ్ జైలు తనిఖీ



ఖైదీలతో మాట్లాడుతున్న న్యాయమూర్తి తంగమణి

డోన్ టౌన్: పట్టణంలోని సబ్ జైలును సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సోమవారం సందర్శించారు. ఖైదీలతో సమావేశమై వారి ఆరోగ్య పరిస్థితులు, వైద్య సదుపాయాలపై ఆరా తీశారు. శిక్ష వివరాలు, బెయిల్ తదితర వాటిని అడిగి తెలుసుకున్నారు. బెయిల్ కోసం న్యాయవాదిని నియమించుకోవడానికి ఆర్థిక స్థోమత లేని వారికి ప్రభుత్వమే ఉచితంగా న్యాయవాదిని కేటాయిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం భోజన సదుపాయాలు, జైలు పరిసరాలను పరిశీలించారు. ఆమె వెంట న్యాయ వాది మాధవస్వామి, జైలు, కోర్టు సిబ్బంది ఉన్నారు.

విధులు బహిష్కరించిన న్యాయవాదులు



డోన్ కోర్టు ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు

డోన్ టౌన్/ కోవెలకుంట్ల: అనంతపురానికి చెందిన న్యాయవాది బీవీ శేషాద్రి మృతిని నిరసిస్తూ డోన్ కోర్టు, కోవెలకుంట్ల జూనియర్ సివిల్‌కోర్టు న్యాయవాదులు సోమవారం విధులు బహిష్కరించారు. డోన్, కోవెలకుంట్ల బార్ అసోసియేషన్ అధ్యక్షులు వేణుగోపాల్ గౌడ్, శ్రీనివాసులు మాట్లాడుతూ.. అనంతపురం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీసుల అనుచిత ప్రవర్తనతో న్యాయవాది మృతి చెందాడని ఆరోపించారు. సీఐ శాంతిలాల్‌పై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. న్యాయవాదులు భాస్కర్‌నాయుడు, రాగుల రాముడు, మధుసూదన్‌గౌడ్, శ్రీనివాసులు, తిరుపాలు, ఓబులేసు, నాగశేషు, తిరుపతయ్య, నరసింహుడు పాల్గొన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

కోవెలకుంట్ల: బనగానపల్లె మండలం యాగంటిలో జనవరి 6 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న జిల్లా స్థాయి ఎస్‌ఎఫ్‌ఐ విద్యా, వైజ్ఞానిక శిక్షణా తరగతులను జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంఆర్ నాయక్ తెలిపారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం కరపత్రాలను విడుదల చేశారు.